క్లుప్తంగా

గ్రామస్తుల నిరసన



మానకొండూర్ రూరల్: శ్రీనివాస్‌నగర్ గ్రామ కారోబార్ విధులు సక్రమంగా నిర్వహించడం లేదని, అధికంగా పంచాయతీ బిల్లులు వసూలు చేస్తున్నాడని ఆరోపిస్తూ గ్రామస్తులు శనివారం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం



ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

శంకరపట్నం: కేశవపట్నంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దిష్టిబొమ్మను బీఆర్‌ఎస్ నాయకులు దహనం చేశారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఇంటిపై కాంగ్రెస్ నాయకులు దాడి చేశారని ఆరోపిస్తూ బీఆర్‌ఎస్ నాయకులు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి ఆందోళన చేశారు. పోలీసులు నచ్చజెప్పి రాస్తారోకోను విరమింపజేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్, మాజీ జెడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, గద్దపాక విండో చైర్మన్ తిరుపతిరెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అనాథకు అండగా ఎమ్మెల్యే



ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే సత్యం

చొప్పదండి: రాగంపేటకు చెందిన దీకొండ సాద్విన్ తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మారగా.. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శనివారం రాగంపేటకు వెళ్లి బాలుడిని పరామర్శించారు. రూ.20వేల ఆర్థిక సాయమందించారు. కలెక్టర్‌తో మాట్లాడి ప్రభుత్వపరంగా అందాల్సిన సాయమందేలా చూస్తానని హామీ ఇచ్చారు. కుక్కల స్వామి అనారోగ్యంతో మృతిచెందగా.. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయమందించారు. ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, పెరుమాండ్ల గంగయ్యగౌడ్, మునిగాల చందుగౌడ్, బాలకిషన్, కొట్టి అశోక్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాగంపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు స్థానిక ప్రాథమిక పాఠశాలలో అయిదోతరగతి చదువుతున్న సాద్విన్‌కు రూ.12,500 విరాళంగా అందించారు. హెచ్‌ఎం దినకర్, ఉపాధ్యాయులు కర్ర వెంకటరాంరెడ్డి, గంగేశం, శ్రీనివాస్, నర్సయ్య, రజియోద్దీన్, రాజ్‌కుమార్, యుగెందర్, శంకరయ్య, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

చిగురుమామిడి: కొండాపూర్ గ్రామానికి చెందిన ఆకుల రాజేందర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా.. 7వతరగతి అతడితో కలిసి చదువుకున్న స్నేహితులు రూ.23,000 ఆయన భార్య సమతకు అందించారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

జమ్మికుంట: మానేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న 2 ఇసుక ట్రాక్టర్లు పట్టుకొని కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ రామకృష్ణ శనివారం తెలిపారు. విలాసాగర్‌కు చెందిన ట్రాక్టర్ యజమాని మోరె శివప్రసాద్, డ్రైవర్ గిరిబాబు, తనుగుల గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని, డ్రైవర్ జూపాక కృష్ణ పట్టణంలో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకొని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

శ్రమదానం

కరీంనగర్‌అర్బన్/కరీంనగర్‌స్పోర్ట్స్: ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఆశించకుండా వాకర్లే స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం అంబేడ్కర్ స్టేడియంలో వాకింగ్ ట్రాక్‌పై ఉన్న పిచ్చిమొక్కలు, ముళ్లకంపలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. వాకర్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 304 ఎలక్ట్ గవర్నర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియం వాకర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ మున్సిపల్ సిబ్బంది, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ సిబ్బంది, స్టేడియంలోని అన్ని వాకర్ సంఘాల సభ్యుల సహకారంతో శ్రమదానం నిర్వహించారు. ఉదయం, సాయంత్రం వేళలో వేల సంఖ్యలో వాకర్స్ వస్తుండగా పలు అసౌకర్యాలు ఇబ్బందికి గురిచేస్తున్నాయి. ఈ క్రమంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. రమణారెడ్డి, సేవ్యానాయక్, సుద్దాల రాజన్న తదితరులు పాల్గొన్నారు.

వరిపంట కోస్తున్నారా.. జాగ్రత్త

- సరైన సమయంలో కోతలు చేపట్టాలి
- లేకుంటే దిగుబడిపై ప్రభావం
- కోత కోసే వారం ముందు నుంచే నీటిని తీసెయ్యాలి
- జిల్లాలో 2.76లక్షల ఎకరాల్లో వరి సాగు అంచనా



వరి కోస్తున్న యంత్రం

వీణవంక: వానాకాలం వరి కోతలు ప్రారంభమయ్యాయి. రైతులు పైరు కోసే పనుల్లో నిమగ్నమయ్యారు. 4 రోజుల క్రితం కురిసిన వర్షానికి పొలాలు తడారడం లేదు. అయితే ఆరుగాలం కష్టపడి వరి పంట సాగు చేయడం ఒక ఎత్తయితే.. దానిని కోతల సమయంలో కాపాడుకోవడం మరో ఎత్తు. పైరు తారిపోకుండా సరైన సమయంలో కోతలు చేపడితే సత్ఫలితాలుంటాయి. లేకుంటే గింజలు తారిపోయి దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుంది. సన్నరకం వరి పంటకు ప్రభుత్వం మద్దతు ధరతోపాటు బోనస్ రూ.500 ఇస్తున్నట్లు ప్రకటించడంతో.. ఈసారి రైతులు ఆ పంట వైపే మొగ్గు చూపారు. మొగిపురుగు, సుడి దోమ రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. ఆశించిన దిగుబడి వచ్చేట్టు లేదని రైతులు వాపోతున్నారు. చెక్‌డ్యాంలు, చెరువులు, కుంటల్లో నీరు పుష్కలంగా ఉండడం.. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాల వల్ల పొలాలు తడారడం లేదు. గత్యంతరం లేక కొందరు రైతులు ట్రాక్‌మిషన్(వరి కోత యంత్రం)తో కోయిస్తున్నారు. గతేదాది వరి కోతల సమయంలో అకాల వర్షాలు రైతులను వెంటడాయి. దీంతో పొలాలు కోసే సమయంలో అవగాహన లేక రైతులు నష్టపోవాల్సి వచ్చింది. కాలపరిమితిని బట్టి సరైన సమయంలో ఆయా రకాల వరి పంటల కోతలు చేపట్టాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో ఈసారి 2.76లక్షల ఎకరాల్లో వరి సాగులోకి వచ్చినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

చివరి గింజ వరకు..

- వరి కోతకొచ్చే 15 రోజుల ముందు నుంచే నీటి తడులను నిలిపేయాలి. తర్వాత పొలంలో కల్తీ గింజలు లేకుండా ఏరెయ్యాలి.
- చివరి గింజ తయారయ్యేంతవరకు పొలం కోయొద్దు. లేకుంటే తాలు వచ్చే ప్రమాదముంది. తాలు ఎక్కువగా ఉంటే మార్కెట్లో ధాన్యం అమ్ముకోవడం ఇబ్బందిగా మారుతుంది.
- మంచు ఆరిన తర్వాత పంట కోయాలి. మంచు ఉన్న సమయంలో కోస్తే గింజలు మెత్తబడి నలుపు రంగులోకి వస్తాయి.
- యంత్రాలతో కోసేటప్పుడు రైతులు జాగ్రత్తగా ఉండాలి. యంత్రం వెనకకు వచ్చేటప్పుడు చూసుకోవాలి. లేకుంటే ఏదైనా ప్రమాదం జరిగే అవకాశముంది.
- యంత్రంతో కోసేముందు పొలం మడుల చుట్టు ఒడ్ల వెంట వరిని కోయాలి. దీంతో పరిగేను నివారించొచ్చు. సీడ్ ప్లాంట్లకు ధాన్యమిచ్చే రైతులు కల్తీ గింజలు లేకుండా చూసుకోవాలి.

ఆరబెడితేనే నాణ్యత

- ధాన్యం ఆరబెట్టేటప్పుడు పలుచగా పోయాలి. తద్వారా తొందరగా ధాన్యం ఎండుతుంది. దీంతో తాటిపత్రుల కిరాయి తప్పుతుంది.
- ధాన్యాన్ని ఆరబోసిన తర్వాత రోజుకు కనీసం నాలుగుసార్లు కాళ్లతో దున్నాలి. లేదా రోజుకోసారి ధాన్యం తిరగపోయాలి. దీంతో అడుగున ఉన్న గింజలు మీదికి వచ్చి సమానంగా ఆరుతాయి. తేమ శాతం కూడా త్వరగతిన తగ్గుతుంది.
- ధాన్యం ఆరబెట్టకుంటే గింజలు రంగు మారి నాణ్యత దెబ్బతింటుంది. చెత్త, మట్టి, తాలు లేకుండా చూసుకోవాలి. తాలు ఎక్కువగా వస్తే గాలికి ఆరబోయాలి. నిబంధనల ప్రకారం తేమ శాతం ఉంటేనే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేస్తారు.
- సన్నరకం ధాన్యం కొంతమంది రైతులు ఇళ్లలో నిల్వ చేసుకుంటారు. ఈ సమయంలో బస్తాలను నేల మీద కాకుండా చెక్క బల్లాలపై ఉంచితే ఎలుకల బారి నుంచి కాపాడుకోవచ్చు.

సరైన సమయంలో కోతలు చేపట్టాలి

ప్రస్తుతం వరి కోతలు ప్రారంభమయ్యాయి. రైతులు వరి కోతలను సరైన సమయంలో చేపట్టాలి. తారిపోయేంతవరకు ఉంచకుండా చూసుకోవాలి. లేకుంటే గింజలు తారిపోయి దిగుబడిపై ప్రభావం పడుతుంది. వరి కోసే పది రోజుల ముందే నీటి తడులను నిలిపేయాలి.

– అచ్యుత్, వ్యవసాయ విస్తరాధికారి, వీణవంక



నిర్మానుష్యంగా హుజూరాబాద్ బస్టాండ్



చొప్పదండి: రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

బంద్ విజయవంతం

హుజూరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ బీసీ సంఘాలిచ్చిన బీసీ బంద్ నియోజకవర్గంలో శనివారం విజయవంతమైంది. పట్టణంలోని ఆర్టీసీ డిపో గేటు ఎదుట అఖిలపక్ష నాయకులు ధర్నాకు దిగారు. పట్టణంలోని వర్తక, వాణిజ్య, వ్యాపార సముదాయాల యజమానులు బంద్ పాటించారు.

చొప్పదండి: మండలంలో బీసీ బంద్ పిలుపు మేరకు వ్యాపార, వాణిజ్య సముదాయాలు, పాఠశాలలు మూసి బంద్‌కు మద్దతు పలికారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు బంద్‌లో పాల్గొన్నారు. బీజేపీ నాయకులు రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు.

మానకొండూర్: బీసీ సంక్షేమ సంఘం ఇచ్చిన పిలుపు మేరకు నియోజకవర్గ కేంద్రంలో బంద్ విజయవంతమైంది. మండల కేంద్రంలోని దుకాణాలు, హోటళ్లను కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీసీ సంక్షేమ సంఘ నాయకులు మూసేయించారు. సీఐ సంజీవ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

గంగాధర: కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లని జీవోలతో బీసీలను మోసం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విమర్శించారు. శనివారం మండలంలో చేపట్టిన బంద్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిలోని మధురానగర్ చౌరస్తాలో దుకాణాలు మూసేయించి రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మధురానగర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, నాయకులు

తిమ్మాపూర్: మండలవ్యాప్తంగా బీసీ బంద్ ప్రశాంతంగా జరిగింది. అన్ని పార్టీలకు చెందిన బీసీ నేతలు రేణిగుంటలోని టోల్గేట్ వద్ద నుంచి పదుల సంఖ్యలో బైకులపై ర్యాలీగా అల్గునూర్ చౌరస్తా వరకు చేరుకొని ధర్నా చేశారు. అల్గునూరులో రోడ్డును దిగ్బంధనం చేసిన నేతలను ఎల్‌ఎండీ ఎస్‌ఐ శ్రీకాంత్ అదుపులోకి తీసుకొని ట్రాఫిక్ క్లియర్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు ఉల్లెంగుల ఏకానందం, వివిధ పార్టీల మండల అధ్యక్షులు రావుల రమేశ్, బండారి రమేశ్, నాయకులు లక్ష్మీనారాయణగౌడ్, మాచర్ల అంజయ్య, వేల్పుల ఓదెలుయాదవ్, పొన్నం అనిల్, పోలు రాముర‌మేశ్, శివరామకష్ణ, మండల బీసీ నేతలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైదాపూర్: రాష్ట్ర బీసీ జేఏసీ పిలుపు మేరకు శనివారం మండలంలో మండల బీసీ జేఏసీ నాయకులు బంద్‌ను విజయవంతం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. మండల కేంద్రంలో బీసీ జేఏసీ నాయకులు బంద్‌ను పర్యవేక్షించారు. దళిత సంఘాలు, ఎస్సీ, ఎస్టీ నాయకులు మద్దతుగా పాల్గొన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. జంపాల భూపతి, దొంత సుధాకర్, గుండారపు శ్రీనివాస్, ఊసకోయిల రాఘవులు, కామని వీరేశం, రాయిశెట్టి చంద్రయ్య, మునిగంటి సంతోష్, సోమారపు రాజయ్య, పొడిశెట్టి వెంకట్రాజం, గాదపాక కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: బీసీ రిజర్వేషన్‌కు మద్దతుగా మండలంలో రాజకీయ పార్టీల నాయకులు వేర్వేరుగా ఆందోళన చేశారు. కాంగ్రెస్, సీపీఐ, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు కేశవపట్నం ప్రధాన రోడ్డుపై ర్యాలీ నిర్వహించారు.

జమ్మికుంట: పట్టణంలో నిర్వహించిన బీసీ బంద్ విజయవంతమైంది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం పోటీ పడి పాల్గొన్నాయి.

రామడుగు: మండలంలోని పలు గ్రామాల్లో బంద్ ప్రశాంతంగా జరిగింది. నాయకులు దుకాణాలు, హోటళ్లు, ఇతర వ్యాపార సంస్థలు, పాఠశాలలను మూసేయించారు.

చిగురుమామిడి: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో బీసీ బంద్ సంపూర్ణంగా కొనసాగింది. బీఆర్‌ఎస్, బీసీ జేఏసీ నాయకులు వేర్వేరుగా ధర్నా నిర్వహించారు.

గన్నేరువరం: బీసీ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ ప్రశాంతంగా జరిగింది. వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సహకార సంఘానికి స్థలం విరాళం

చొప్పదండి: కొలిమికుంటలో గీత పారిశ్రామిక సహకార సంఘానికి తాళ్లపల్లి జానమ్మ స్మారకార్థం ఒక గుంట స్థలాన్ని కుటుంబ సభ్యులు శనివారం సంఘ సభ్యులకు అందించారు. గ్రామంలో గీత కార్మికులకు సంఘ భవనం నిర్మించుకునేందుకు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్‌ను సంప్రదించగా.. సర్వే నంబర్ 276లో ఒక గుంట స్థలాన్ని కేటాయించారు.



కొండాపూర్‌లో బంతి పూల తోట

భలే భలే.. బంతి సాగు

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వచ్చే బంతి పూల తోటలను సాగు చేస్తున్నారు. కూరగాయల సాగుతోపాటు బంతి పూల తోటలను సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. గత సద్దుల బతుకమ్మ పండుగకు కిలో పూలను రూ.100 నుంచి రూ.200 వరకు రైతులు విక్రయించారు. ఇప్పుడు దీపావళి పండుగకు పూల గిరాకీ బాగానే ఉంటుందని పలువురు రైతులు తెలిపారు. గ్రామాల్లో నోముల పండుగ సందర్భంగా బంతి పూల క్రయవిక్రయాలు జోరుగా సాగుతుంటాయన్నారు. వివాహ వేడుకలు, ఇతర ప్రారంభోత్సవ కార్యక్రమాలకు ఈ పూల ప్రత్యేకత ఎంతో ఉంటుందన్నారు. చిగురుమామిడి, సుందరగిరి, గాగిరెడ్డిపల్లి, కొండాపూర్, సీతారాంపూర్, లంబాడిపల్లి, పీచుపల్లి, చిన్నముల్కనూర్ గ్రామాల్లో రైతులు పది గుంటల నుంచి 20 గుంటల్లో బంతి పూల తోటలను సాగు చేశారు. ఒకవైపు కూరగాయల సాగు, మరోవైపు బంతి పూలతో రైతులు లాభాలు గడించడం విశేషం. సబ్సిడీపై ప్రభుత్వం మంచి నాణ్యమైన పూలు, కూరగాయల విత్తనాలు సరఫరా చేస్తే మరింత లాభాలు గడించే అవకాశముందని పలువురంటున్నారు.

కార్యవర్గం ఎన్నిక

వీణవంక: మండల గ్రామ పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వల్భాపూర్ కార్యదర్శి అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా రవి, గౌరవ అధ్యక్షుడిగా కిషన్, ఉపాధ్యక్షులుగా యశోద, హరీశ్, సంయుక్త కార్యదర్శిగా ఐలోని, సుష్మ, కోశాధికారిగా కృష్ణ, ఈసీ మెంబర్లుగా సందీప్, స్వప్న, రజిత, రాజు, శరత్, నరేశ్ ఎన్నికయ్యారు.

మార్కెట్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం

చొప్పదండి: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృషితో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం మంజూరైందని ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేశ్ తెలిపారు. కలెక్టర్‌తో మాట్లాడి చొప్పదండిలో కొనుగోలు కేంద్రానికి కృషి చేసినందున రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు

గంగాధర: చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర మండల కేంద్రానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరైందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. కొన్నేళ్లుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోసం డిమాండ్ చేసినా పట్టించుకొని పరిస్థితి ఉందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంజూరైందన్నారు.

నిరుపయోగంగా శ్మశాన వాటిక



చిగురుమామిడి: గాగిరెడ్డిపల్లి గ్రామంలో 2021లో నిర్మించిన శ్మశాన వాటికను ఉపయోగించడం లేదు. శ్మశాన వాటిక చుట్టూ చెట్లు, ముళ్లపొదలున్నాయి. రూ.40లక్షలు వెచ్చించి నిర్మించారు. సంవత్సరం క్రితం ఈదురు గాలులకు స్నానాల కోసం వేసిన రేకులు లేచిపోయాయి. ఇప్పటివరకు సరిచేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జమ్మికుంట: పట్టణంలోని ఫ్లయోవర్ బ్రిడ్జి కింద ఖాదీ కాంప్లెక్స్ ఓ కిరాణం షాపు వద్ద రోడ్డుపై తాగునీటి కోసం ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పైపులైన్ లీకేజవుతోంది. రోడ్డుపై నీరు పారుతూ కిలోమీటర్ వరకు బురదమయంగా మారుతోంది. నెలలుగా రోడ్డుపై నీరు పారుతోంది. మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు, పాదచారులు వాపోతున్నారు. మరమ్మతు చేసి నీరు రాకుండా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
ఎండీ అయాజ్, జమ్మికుంట మున్సిపల్ కమిషనర్, సెల్ నంబర్: 8978778080

వాట్సాప్ చేయండి

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

అనాథ వృద్ధులకు కంటి ఆపరేషన్లు

రామడుగు: వెలిచాల గ్రామ పరిధిలో ఉన్న స్పందన అనాథ వృద్ధుల ఆశ్రమంలో కంటిచూపుతో ఇబ్బంది పడుతున్న 8 మంది వృద్ధులకు శనివారం కరీంనగర్‌లోని రేకుర్తి కంటి వైద్యశాలలో వైద్యుడు దారం రఘురామన్ కంటి ఆపరేషన్లు నిర్వహించారు. వైద్య సిబ్బందికి ఆశ్రమ నిర్వాహకుడు మంచికట్ల శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.



రేకుర్తి కంటి వైద్యశాలలో వృద్ధులు

ఉచిత వైద్యశిబిరం

చిగురుమామిడి: రేకొండ గ్రామంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన శిబిరంలో సురక్ష హాస్పిటల్ హుస్నాబాద్, శ్రీనివాస విజన్‌సెంటర్ చిగురుమామిడి, శరత్ మాక్సివిజన్ హాస్పిటల్ కరీంనగర్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 238 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. బీపీ, షుగర్, కంటి పరీక్షలు చేశారు. డాక్టర్ సాయిశ్రీ, డాక్టర్ సతీశ్, కంటి నిపుణుడు తిప్పారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మందులు అందిస్తున్న వైద్యులు

పశువులకు గాలికుంటు టీకాలు

మానకొండూర్: లలితాపూర్, నిజాయితీగూడెం గ్రామాల్లో పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు కార్యక్రమం పశువైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. 310 పశువులకు టీకాలు వేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. మండల పశు వైద్యాధికారులు డాక్టర్ అరవింద్‌రెడ్డి, డాక్టర్ సుస్మిత, వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



టీకా వేస్తున్న వైద్యాధికారులు

పెయింటింగ్ పోటీల్లో తృతీయ బహుమతి

మానకొండూర్: తెలంగాణ నేషనల్ గ్రీన్ క్రాఫ్ట్‌లో భాగంగా ప్రభుత్వ డిగ్రీ ఉమెన్స్ కళాశాల కరీంనగర్‌లో నిర్వహించిన పెయింటింగ్ పోటీల్లో మానకొండూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని అనంతోజు శివాని తృతీయ బహుమతి సాధించింది. ప్రిన్సిపాల్ కె.రాజేశ్వర్‌రావు, లెక్చరర్లు అభినందించారు.



బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

సన్మానం

రామడుగు: గవర్నర్ చేతుల మీదుగా ఉపాధ్యాయ అవార్డు స్వీకరించిన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డిని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి శనివారం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు రెహమాన్, సిరిపురం నాగప్రసాద్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు కర్ర వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.



నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న సత్యప్రసన్న



అధ్వాన రహదారితో అవస్థలు

రామడుగు: కరీంనగర్–జగిత్యాల ప్రధాన జాతీయ రహదారిపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. రహదారిపై భారీగా గుంతలు పడ్డా పూడ్చే పరిస్థితులు కనిపించడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఈ జాతీయ రహదారిపై వెదిర గ్రామం నుంచి కాకతీయ కాలువ వరకు దాదాపు 5 కిలోమీటర్ల మేర రోడ్డుపై గుంతలు పడి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా.. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.